
సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

I

శుక్రవారం : 24 : జనవరి : 2025



సన్ మోహనం

పాడేరు ప్రాంతంలో సూర్యుడు ఉదయించే వేళ.. అస్తమించే సమయంలో అద్భుత దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. కొండల మధ్య అరుణ వర్ణంలో కాంతులు కనువిందు చేశాయి. గురువారం ఉదయం మంచు ప్రభావం లేకపోవడంతో ఈ అందాలను ప్రకృతి ప్రేమికులు తనివితీరా వీక్షించారు. ఉదయం 7 గంటలకే సూర్యోదయం అయింది. – సాక్షి, పాడేరు

న్యూస్‌రీల్

కలెక్టర్‌కు ఉత్తమ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు



సాక్షి,పాడేరు: కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌కు 2024 సంవత్సరానికి సంబంధించి ఉత్తమ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు లభించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. గత ఏడాది ఓటర్ల జాబితాను సమర్థవంతంగా తయారు చేయడంతో పాటు కొత్త ఓటర్ల చేర్పులు, అనర్హుల తొలగింపు వంటి అంశాలలో కలెక్టర్ సేవలను గుర్తించిన ఎన్నికల కమిషన్ ఉత్తమ పురస్కారానికి ఎంపిక చేసింది. ఈనెల 25వతేదీన జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరగనున్న ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు జిల్లాకు చెందిన గిరిజన సంక్షేమశాఖ ఎస్‌డీసీ లోకేశ్వరరావు, రంపచోడవరం తహసీల్దార్ పి.రామకృష్ణ, పాడేరు పీఎస్ 153 బీఎల్వో వి.సౌందర్య, అరకు పీఎస్ 294 బీఎల్వో కె.సుందర్రావు ఉత్తమ అవార్డులు అందుకోనున్నారు.

నేటి నుంచి 'కొత్తపల్లి' సందర్శన నిలిపివేత

- నాలుగురోజులపాటు మూసివేత
- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ వెల్లడి

పాడేరు : జి.మాడుగుల మండలంలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన కొత్తపల్లి జలపాతాన్ని ఈనెల 24 నుంచి 27 వరకు మూసివేస్తున్నట్లు ఐటీడీఏ పీవో వి. అభిషేక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు రోజుల పాటు జలపాతాన్ని మూసివేసి ఆధునికీకరణ పనులు చేపడుతామన్నారు. నాలుగు రోజులపాటు కొత్తపల్లి జలపాతంలో పర్యాటకుల ప్రవేశాలను పూర్తిగా రద్దు చేయాలని స్థానిక సిబ్బందిని ఆదేశించారు. జలపాతాల సుందరీకరణ అనంతరం ప్రవేశం కల్పిస్తామన్నారు. ఈ విషయాన్ని పర్యాటకులు గమనించాలని ఆదేశించారు.

ఏకలవ్యలో ప్రవేశాలకు 19 వరకు దరఖాస్తు గడువు

రంపచోడవరం: రంపచోడవరం, చింతూరు డివిజన్లలో ఆరు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి అర్హులైన గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పీవో కట్టా సింహాచలం సూచించారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీషు మీడియంలో సీబీఎస్ఈ సిలబస్‌లో బోధన ఉంటుందన్నారు. ఈ నెల 17న నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని, ఆన్‌లైన్ దరఖాస్తులు 22 నుంచి స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుకు ఫిబ్రవరి 19 ఆఖరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. ఆన్‌లైన్ హాల్‌టికెట్లు 22న జారీ చేస్తారని, 25న ఈఎంఆర్ఎస్ఎస్‌టీ ఎంట్రన్స్ పరీక్ష జరుగుతుందని పీవో పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులు హెచ్‌టీటీపీఎస్:/ టీడబ్ల్యూఆర్ఈఐఎస్‌సీఈటీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్/నందు లభిస్తాయన్నారు. ఆరు ఏకలవ్య పాఠశాలల్లో 360 సీట్లు ఉన్నట్లు తెలిపారు.కో ఎడ్యుకేషన్ ఉంటుందని ఆరు మండలాల్లో 30 సీట్లు బాలురు, 30 సీట్లు బాలికలకు కేటాయించినట్లు తెలిపారు.

జాబ్‌మేళాకు ఎంపికైన అభ్యర్థులకు విజ్ఞప్తి

చింతపల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులు ఈనెల 25న కళాశాలలో హాజరు కావాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయబారతి సూచించారు.ఈ నెల 6వ తేదీన జరిగిన జాబ్ మేళాలో వివిధ కంపెనీలకు ఎంపికైన వారంతా తమ ఒరిజనల్ ధ్రువపత్రాలతో కంపెనీ ప్రతినిధుల ముందు హాజరుకావాలని ఆమె సూచించారు. ఇంటర్న్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకున్న తృతీయ సంవత్సర విద్యార్థులు కూడా అదే రోజు హాజరు కావాలని కోరారు. అదేవిధంగా ఇంటర్ ఫైనల్ విద్యార్థులు కూడా ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలని, లేకుంటే 6వ సెమిస్టర్‌కు అనర్హులు అవుతారన్నారు. దీనివల్ల ఒక విద్యా సంవత్సరం కోల్పోవలసి వస్తుందని ఆమె విజ్ఞప్తి చేశారు.

దుర్గ్-విశాఖపట్నం-దుర్గ్ వందేభారత్ కోచ్‌ల కుదింపు

తాటిచెట్లపాలెం (విశాఖ): ఆశించిన స్థాయిలో ఆక్యుపెన్సీ లేనందున దుర్గ్-విశాఖపట్నం-దుర్గ్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు కోచ్‌లను కుదించేసారు. ఈ రైలు ప్రారంభం నుండి కూడా కనీసం అక్యుపెన్సీ ఉండడం లేదు. దీనితో ఈ రైలు కోచ్‌లను తగ్గించేందుకు రైల్వే అధికారులు నిర్ణయించారు. ఈ నెల 24వ తేదీ నుండి విశాఖపట్నం–దుర్గ్–విశాఖపట్నం(20829/20830) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ 8కోచ్‌లతో నడువనుంది. శుక్రవారం నుండి 1-ఎగ్జిక్యూటివ్ చైర్‌కార్, 7-చెయిర్‌కార్ కోచ్‌లతో ఈ రైలు నడుస్తుంది. ఇప్పటివరకు ఈ రైలు 16కోచ్‌లతో నడిచేది.

చోడవరంలో ఏపీ 〉 ట్యాక్స్ 〈 పెందుర్తిలో పీఆర్

- చోడవరంలో టన్నుకు రూ.250 చొప్పున వసూలు
- రోజుకు రూ.10 లక్షలు.. నెలకు రూ.3 కోట్లు వసూలు
- పక్క నియోజకవర్గ నేత ప్రమేయంపై విమర్శలు
- పెందుర్తి దరి నరవలో ఇష్టారాజ్యంగా అక్రమ మైనింగ్
- కూటమి నేతకు ట్రిప్పునకు కొంత చొప్పున చెల్లింపు



రోలుగుంట మండలంలో టిప్పర్లలో గ్రావెల్ తరలింపు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

అధికారంలోకి వచ్చిన తరువాత కూటమి నేతలు అక్రమ మైనింగ్‌కు ఎక్కడికక్కడ అనుమతిస్తూ... తమ సొంత ట్యాక్స్‌లను వసూలు చేస్తున్నారు. అనకాపల్లి నియోజకవర్గంలో అక్రమ మైనింగ్ వ్యవహారంలో ఒక్కో ట్రిప్పునకు రూ.22 వేలు చొప్పున కూటమి నేతలు వసూలు చేస్తుండగా.. చోడవరం, పెందుర్తి నియోజకవర్గాల్లో 'ఏపీ' ట్యాక్స్, 'పీఆర్' ట్యాక్స్ పేరుతో వసూలుకు తెగబడటం చర్చనీయాంశమైంది. చోడవరం నియోజకవర్గంలోని రోలుగుంట మండలంలో అధికార, అనధికార క్వారీల నుంచి తరలివెళ్లే కంకరతోపాటు బండరాళ్లకు ప్రతీ టన్నుకు రూ.250 చొప్పున 'ఏపీ' ట్యాక్స్ పేరుతో వసూలు చేస్తున్నారు. అయితే పక్కనున్న నియోజకవర్గ నేత పేరుతో టిప్పరు, ట్రాక్టరు యజమానుల నుంచి ఈ ట్యాక్స్ వసూలు చేస్తుండటం గమనార్హం. ఇక పెందుర్తి నియోజకవర్గంలోని నరవ ప్రాంతంలో అక్రమ గ్రావెల్ తవ్వకాలు రాత్రి, పగలనకుండా ఇష్టారాజ్యంగా సాగుతున్నాయి. ఏకంగా ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఏపీఐఐసీ), అటవీశాఖ భూముల్లోనే ఈ తవ్వకాలు చేపడుతున్నారు. ఈ అక్రమ తవ్వకాలు చేపడుతున్న వ్యక్తులు... కూటమి నేతకు 'పీఆర్' ట్యాక్స్ చెల్లిస్తున్నారు. దీంతో మైనింగ్ అధికారులు ఎవరూ అటువైపుగా కన్నెత్తి చూడటం లేదన్న ఆరోపణలున్నాయి.

నెలకు రూ.3 కోట్లు వసూలు!

చోడవరం నియోజకవర్గం రోలుగుంట మండలంలో చేపడుతున్న అధికార, అనధికార మైనింగ్ ద్వారా ప్రతీ రోజూ పదుల సంఖ్యలో లారీల నుంచి కంకర తరలివెళుతోంది. ఇక స్థానిక అవసరాలకు ట్రాక్టర్ల ద్వారా కూడా తరలిస్తున్నారు. గుర్తింపు ఉన్న క్వారీల నుంచి తరలిస్తున్న వాటికి సీనరేజీ కింద ప్రభుత్వం వసూలు చేసే మొత్తానికి అదనంగా టన్నుకు రూ. 250 వసూలు చేస్తున్నారు. పక్క నియోజకవర్గానికి చెందిన కూటమి నేత పేరుతో 'ఏపీ' ట్యాక్స్‌గా అధికారికంగా ఈ మొత్తాన్ని వసూలు చేస్తుండటం గమనార్హం. అంటే ఇక్కడ ప్రతీ రోజూ రూ.10 లక్షలు.. నెలకు రూ.3 కోట్ల మేర వసూలు చేస్తున్నారు. నిబంధనల మేరకు ఒక్కో లారీ నుంచి 20 టన్నుల కంకరను తరలించాల్సి ఉండగా.. 30 టన్నుల వరకు తరలించేస్తున్నారు. తద్వారా ఒక్కో టన్నుకు అదనంగా రూ. 250 చెల్లించి.. అధిక లోడును తీసుకెళ్లేందుకు టిప్పరు యాజమాన్యాలకు కూటమి నేతలు అనుమతిస్తున్నారు. ఇక్కడి నుంచి తరలించే ఏ వాహనాన్ని కూడా అటు మైనింగ్ అధికారులు కానీ.. ఇటు రవాణాశాఖ అధికారులు కానీ ఆపేందుకు సాహసించడం లేదు.



క్వారీలో టిప్పర్లలో బండ రాళ్లు ఎక్కిస్తున్న పొక్లెయినర్

అధిక లోడుకు అనధికారికంగా అనుమతి లభిస్తుండటంతో సదరు టిప్పరు యజమానులు కూడా రూ.250 మొత్తాన్ని చెల్లిస్తున్నట్టు తెలుస్తోంది. ట్రాక్టర్ యజమానులు కూడా టన్నుకు రూ.250 చొప్పున చెల్లించి అదనపు లోడును తీసుకెళుతున్నారు. అయితే సదరు టిప్పరు, ట్రాక్టర్ యజమానులు.. ఇంటి నిర్మాణదారులు, ఎన్ఆర్ఈజీఎస్, రోడ్డు పనులు చేస్తున్న కాంట్రాక్టర్లపై భారం మోపుతున్నారు. తద్వారా ఇంటి నిర్మాణ వ్యయం పెరుగుతోందని నిర్మాణదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్ఆర్ఈజీఎస్ పనులు, సీసీ రోడ్లు, బీటీ రోడ్లతో పాటు డ్రైనేజీ నిర్మాణంలో అదనపు భారాన్ని మోయాల్సి వస్తోందని కాంట్రాక్టర్లు కూడా గగ్గోలు పెడుతున్నారు.

గుంతలు తవ్వినా...!

పెందుర్తి నియోజకవర్గం నరవ ప్రాంతంలో చెరోవైపు పంచుకొని మరీ కూటమి నేతలు గ్రావెల్ తవ్వకాలను చేపడుతున్నారు. వాస్తవానికి ఈ భూమి ఏపీఐఐసీతో పాటు అటవీశాఖకు చెందినది. ఇక్కడా గ్రావెల్ తవ్వకాలకు అనుమతి లేదని మైనింగ్ అధికారులు కూడా పేర్కొంటున్నారు. దీనిపై గతంలో 'సాక్షి' పలు కథనాలు ప్రచురించింది. దీంతో అప్పటి తహసీల్దార్ అక్కడకు వెళ్లి వాహనాలు వెళ్లకుండా అడ్డుగా గుంతలు తవ్వారు. ఇప్పుడు ఆ గుంతలను పూడ్చడంతో పాటు కూటమి నేతలు చెరోవైపు రాత్రి, పగలు తేడా లేకుండా భారీగా గ్రావెల్‌ను తరలిస్తున్నారు. ప్రస్తుత తహసీల్దారు అటువైపుగా కనీసం కన్నెత్తి కూడా చూడటం లేదు. ఇక మైనింగ్ అధికారుల గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే, ఇంత దర్జాగా తవ్వకాలు సాగుతుండటానికి కారణం సదరు వ్యక్తులు.. స్థానిక నియోజకవర్గ కూటమి నేతకు 'పీఆర్' ట్యాక్స్ పేరుతో ట్రిప్పునకు ఇంత మొత్తం చెల్లిస్తుండటమే. మొత్తంగా కూటమి నేతలు ఎక్కడికక్కడ స్థానికంగా ట్యాక్స్ పేరుతో వసూళ్లకు తెగబడుతుండటం చర్చనీయాంశమవుతోంది.



నరవలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు

కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు

- జి.మాడుగులలో 4.9 డిగ్రీల నమోదు
- వణికిస్తున్న చలిగాలులు
- ఉదయం 10 గంటల వరకు వీడని మంచు తెరలు



రాజుపాకలు ప్రాంతంలో కురుస్తున్న మంచు



పాడేరులో చలిమంట కాగుతున్న స్థానికులు

సాక్షి, పాడేరు: ఏజెన్సీలో చలిగాలులు విజృంభిస్తున్నాయి. పొగమంచు తీవ్రత తక్కువగా ఉంది. సూర్యోదయం వేగంగా అయినప్పటికీ చలి తీవ్రత ఎక్కువగానే ఉంది. మన్యం వాసులు, పర్యాటకులు చలి మంటలను ఆశ్రయించారు.

చింతపల్లి: మన్యంలో కనిష్ట ఉష్ణోగ్రతలు కొన సాగుతున్నాయి. శీతల గాలులకు ప్రజలు వణికిపోతున్నారు. చింతపల్లి ప్రాంతంలో మంచు తీవ్రత ఎక్కువగా ఉంటోంది. జిల్లాలో గురువారం జి.మాడుగులలో 4.9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు అయినట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ అప్పలస్వామి తెలిపారు. పాడేరు డివిజన్ పరిధిలోని హుకుంపేటలో 5.6, పాడేరులో 5.9, అరకువ్యాలీలో 6.6, పెదబయలులో 6.6, డుంబ్రిగుడలో 7.1, చింతపల్లిలో 7.8, అనంతగిరిలో 10.3, ముంచంగిపుట్టులో 10.4, కొయ్యూరులో 12.7 డిగ్రీలు నమోదు అయినట్టు ఆయన పేర్కొన్నారు. ఉదయం 10 గంటల వరకు మంచు తెరలు వీడటం లేదు. వాహనచోదకులు హెడ్‌లైట్ల వెలుగులో రాకపోకలు సాగిస్తున్నారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి చలిగాలులు వీస్తుండటంతో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

అటవీ ఉత్పత్తుల కొనుగోలుతో ఆర్థికాభివృద్ధి

రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం: ఏజెన్సీలోని వన్‌ధన్ (వీడీవీకే) వికాస కేంద్రాల సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించేలా అటవీ ఉత్పత్తులు కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నామని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ఏడు మండలాల్లోని వన్‌ధన్ వికాస కేంద్రాల ద్వారా చింతపండు, జీడిపిక్క, పసుపు, జాఫ్రా కొనుగోలు చేసి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తామన్నారు. ఈ ఏడాది 150 మెట్రిక్ టన్నుల జీడిపిక్క, 78 వేల కొండచీపుర్లు, 8వేల కిలోల పసుపు కొమ్ములు, 6వేల కిలోల చింతపండు, 27వేల కేజీల జాఫ్రా గింజల కొనుగోలు



మాట్లాడుతున్న రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.వీటిని వనధన్ వికాస కేంద్రాల ద్వారా ప్రాసెసింగ్ చేసి టెండర్ల విధానంలో విక్రయిస్తామన్నారు.ఏజెన్సీలో విద్యుత్, మంచినీరు, మరుగుదొడ్లు లేని అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీడీ డేగలయ్య, ఈఈ ఐ.శ్రీనివాసరావు, సీడీపీవో సంధ్యారాణి, డీపీఎం అపర్ణ, యాంకర్ పర్సన్ రామరాజు,డీఈ మల్లికార్జునరావు, నవజీవన్ ఆర్గనైజేషన్ బిజినెస్ డవలప్‌మెంట్ ప్రతినిధి ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చిన్నారుల మృతిపై సమగ్ర నివేదిక

- కేజీహెచ్‌కు చెందిన వైద్యనిపుణుల బృందం వెల్లడి
- బాధిత కుటుంబాల నుంచి వివరాల సేకరణ

చింతపల్లి: మండలంలోని వాంగెడ్డ కొత్తూరులో శిశువుల వరుస మరణాలపై సమగ్ర విచారణ నిర్వహించి ప్రభుత్వానికి నివేదిస్తామని కేజీహెచ్‌కు చెందిన వైద్య నిపుణుల బృందం సభ్యులు తెలిపారు. వాంగెడ్డ కొత్తూరు గ్రామంలో గడచిన 20 రోజుల్లో వరుసగా ముగ్గురు నవజాత శిశువులు ప్రాణాలు కోల్పోయారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ఈ మరణాలు సంభవించాయని దీనిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు డిమాండ్ చేయడం తెలిసిందే. ఇదే విషయంపై చింతపల్లిలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. వాంగెడ్డ కొత్తూరు గ్రామానికి వెళ్లి అక్కడ బాధిత గిరిజనులతో ఆయన మాట్లాడారు. దీనిపై కలెక్టర్, ఐటీడీఏ పీవోల దృష్టికి ఎమ్మెల్యే తీసుకువెళ్లడంతో ప్రభుత్వం దీనిపై సమగ్ర అధ్యయనం చేయాల్సిందిగా ఆదేశించింది. ఈ మేరకు కేజీహెచ్‌కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ తాతం నాయుడు, డాక్టర్ వందన, డాక్టర్ రాహుల్‌నాయర్‌తో కూడిన బృందం గురువారం మండలంలో పర్యటించింది. ముందుగా స్థానిక ప్రాం



వాంగెడ్డ కొత్తూరు గ్రామంలో వివరాలు తెలుసుకుంటున్న కేజీహెచ్ వైద్యనిపుణులు

తీయ ఆస్పత్రిని సందర్శించింది. నవజాత శిశుసంరక్షణ కేంద్రాన్ని తనిఖీ చేసింది. శిశువులకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించింది. అనంతరం వాంగెడ్డ గ్రామానికి వెళ్లి అక్కడ చిన్నారులను కోల్పోయిన బాధిత కుటుంబాలతో బృందం సభ్యులు మాట్లాడారు. శిశువుల తల్లిదండ్రులతో విడివిడిగా మాట్లాడి మరణానికి ముందు తరువాత దారితీసిన పరిస్థితులను తెలుసుకున్నారు. శిశువుల మరణానికి ప్రధానంగా న్యూమోనియా కారణంగా తాము గుర్తించినట్టు బృందం సభ్యులు తెలిపారు. దీనిపై సమగ్రంగా ప్రభుత్వానికి నివేదిస్తామని బృందం సభ్యులు తెలిపారు. ఈకార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ కృష్ణారావు, చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, ఏవో చంద్రశేఖర్, జర్రెల పీహెచ్‌సీ వైద్యాధికారి మణిదీప్, ఎంపీహెచ్ఈవోలు రామకృష్ణ, బాలయ్య పాల్గొన్నారు.

కొండిబలో తాగునీటి సమస్య పరిష్కారం



కొండిబాలో తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు తదితరులు



సీతంపేటలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, తదితరులు

- ఇచ్చిన హామీ నెరవేర్చా
- ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర
- ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంతో కలిసి పలు పథకాలకు శంకుస్థాపన

అనంతగిరి (అరకులోయ టౌన్): కొండిబ గ్రామస్తులకు ఇచ్చిన హామీ మేరకు తాగునీటి సమస్య పరిష్కరించామని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. గురువారం కొండిబా గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జెడ్పీటిసి గంగరాజు కోరిక మేరకు గత ఏడాది ఈ గ్రామాన్ని సందర్శించానన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని గిరిజనులకు ఇచ్చిన హామీని నెరవేర్చానన్నారు. బోరు, ఓవర్ హెడ్ ట్యాంక్ ఏర్పాటుచేసి 150 కుటుంబాలకు కుళాయిల ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నట్టు ఆమె తెలిపారు. అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ గిరిగ్రామాల్లో రహదారి సౌకర్యం కోసం జెడ్పీ నిధుల కేటాయింపు అభినందనీయమన్నారు. కాశీపట్నం పంచాయతీ సీతంపేటలో సీసీ రోడ్డు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. సీతంపేట, బోందుగుడ రెండు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి జెడ్పీ నిధులు రూ. 10 లక్షలు కేటాయించిన జెడ్పీ చైర్ పర్సన్‌ను ఆయన అభినందించారు. ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను అభినందించారు. మాజీ ఎమ్మెల్యే శోభ హైమావతిదేవి మాట్లాడుతూ 25 ఏళ్ల క్రితం ఈ గ్రామంలోతాను ఎస్.కోట ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రూ. 1.5 లక్షలు మిగతా II పేజీలో ▶

సెల్ టవర్ల నిర్మాణం వేగవంతం

- త్వరితగతిన జాయింట్ సర్వే
- కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

సాక్షి,పాడేరు: జిల్లాలో సెల్ టవర్ల నిర్మాణాలకు సంబంధించి అన్ని శాఖల జాయింట్ సర్వేను వేగవంతం చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం తన కార్యాలయం నుంచి అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌టవర్ల నిర్మాణానికి ఎదురవుతున్న సమస్యలను అధిగమించాలన్నారు.స్థలాల పరిశీలన, సమగ్రమైన సర్వే చేపట్టి ప్రతిపాదనలు ఇస్తే జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించి అనుమతులు జారీ చేస్తామన్నారు.సర్వే రిపోర్టులు వెంటనే సమర్పించాలన్నారు. ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ సౌర్యమన్‌పటేల్, డీఎఫ్‌వో సందీప్‌రెడ్డి, గిరిజన



సెల్‌టవర్లపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సంక్షేమశాఖ ఈఈ కె.వేణుగోపాల్, పంచాయతీ రాజ్ ఈఈ కొండయ్యపడాల్, జియో, ఎయిర్‌టెల్, బీఎస్ఎన్ఎల్ అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎం గొడౌన్లు కలెక్టర్ తనిఖీ

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఈవీఎంల గొడౌన్లను కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ గురువారం మాసాంతపు తనిఖీలు నిర్వహించారు.దీనిలో



ఈవీఎంల కేంద్రం సీలును పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

భాగంగా అరకు పార్లమెంట్, పాడేరు, రంపచోడవరం,అరకు అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంల గొడౌన్ల సీళ్లను ఆయన పరిశీలించారు.సీసీ కెమెరాల వ్యవస్థ,పోలీసు భద్రత చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పద్మలత, డీటీ లక్ష్మణమూర్తి, వివిధ రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విలువిద్యలో అరకు విద్యార్థి దేశాయ్ ప్రతిభ

- రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీలకు ఎంపికైన విద్యార్థితో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

అరకులోయ టౌన్: స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థి దేశాయ్ విలువిద్యలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భరత్ కుమార్ నాయక్ తెలిపారు. ఈనెల 25న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్టు ఆయన వివరించారు. ఈ సందర్భంగా దేశాయ్‌ను ఆయనతోపాటు అధ్యాపకులు గణబాబు, వై.విజయలక్ష్మి, ఎం.అనితకుమారి, పీడీ అప్పారావు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు

- పరిశీలించిన పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్



తలారిసింగి మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ సౌర్యమన్‌పటేల్

సాక్షి,పాడేరు: పట్టణంలోని తలారిసింగి మైదానంలో జరిగే గణతంత్ర వేడుకలకు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేయాలని పాడేరు సబ్‌కలెక్టర్ సౌర్యమన్ పటేల్ ఆదేశించారు. గురువారం ఆయన పెరేడ్ నిర్వహించే ప్రాంతాన్ని పరిశీలించారు. అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ మురళీ, తహసీల్దార్ త్రినాథరావునాయుడు, డీఈఈ ధ్రువకుమార్ పాల్గొన్నారు.

ఇద్దరు బాలురు అదృశ్యం

ఎంవీపీకాలనీ: ఇద్దరు బాలురు అదృశ్యం అయిన ఘటన ఎంవీపీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నక్కవానిపాలెం క్రాంతినగర్‌కు చెందిన 13 ఏళ్ల బాలుడు చాట్ల ధీరజ్ ఓ ప్రైవేట్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం 5 గంటల సమయంలో ధీరజ్ స్నేహితుడి పుట్టినరోజు వేడుక ఉందంటూ బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో పాటు చైతన్యనగర్‌కు చెందిన 14 ఏళ్ల దత్తి యశ్వంత్ కూడా ఆదే రోజు సాయంత్రం ట్యూషన్‌కు అని చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఎంవీపీ పోలీసులకు బాధిత కుటుంబాలు వేర్వేరుగా పిర్యాదు చేశాయి. అయితే ఈ ఇద్దరు బాలురు ఒకే స్కూల్‌కు చెందిన వారు కావడంతో ఇద్దరు కలిసే వెళ్లిపోయి ఉంటారా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. వీరిలో ఓ బాలుడి వద్ద సెల్‌ఫోన్ ఉండటంతో దాని సిగ్నల్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.





చింతామణి గణపతి దత్తక్షేత్రంలో అనఘా వ్రతం చేస్తున్న 1008 మంది దంపతులు (ఇన్‌సెట్) అనుగ్రహ భాషణం చేస్తున్న మైసూర్ గణపతి సచ్చిదానంద స్వామీజీ

ఆ సత్యం తెలిస్తే అత్యాశ, అహం దరిచేరవు

- మైసూర్ గణపతి సచ్చిదానంద స్వామీజీ
- గణపతి దత్త క్షేత్రంలో సామూహిక అనఘా వ్రతం ప్రారంభం

అనకాపల్లి: జన్మించినప్పుడు తీసుకువచ్చేది ఏమీ ఉండదని, మరణించినప్పుడు తీసుకుని పోయేదీ ఏమీ ఉండదని, ఈ సత్యం తెలుసుకుంటే అత్యాశ, అహంకారాలకు తావుండదని మైసూర్ గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు. సిరసపల్లి చింతామణి గణపతి దత్త క్షేత్రంలో గురువారం గణపతి సచ్చిదానంద స్వామీజీ, దత్త విజయానంద తీర్థ స్వామీజీలు 1008 దంపతులతో సామూహిక అనఘా వ్రతం, 32 గణపతుల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గణపతి సచ్చిదానంద స్వామీజీ మాట్లాడుతూ దత్తాత్రేయుడు జ్ఞానాన్ని పెంపొందించి ఉన్నత శిఖరాలకు చేరుస్తారన్నారు. లోక కల్యాణార్థం గణపతి రూపాల్లో ఇది కూడా ఒకటని, ఈ ప్రాంత ప్రజలకు ఎటువంటి చింతలు లేకుండా గణపతి రక్షిస్తారని ఆయన పేర్కొన్నారు. పిల్లల్లో సనాతన ధర్మాన్ని పెంపొందించాలన్నారు. అందరూ సుఖమే కావాలనుకుంటున్నారు గానీ, భక్తిని కోరుకోవడం లేదన్నారు. ఆధ్యాత్మిక ప్రవచనాలు చేసే ప్రతి వ్యక్తి తన ధర్మాన్ని పాటిస్తే గౌరవ ప్రతిష్ఠలు బలపడతాయన్నారు. అంతకు ముందు స్వామీజీ గణపతి పూజ, పుణ్యాహవచనం పంచగవ్య ప్రాశన, మహా సంకల్పం, ఆంజనేయ స్వామి విశిష్టతను వివరిస్తూ భక్తులకు ప్రవచనాలు చేశారు. ఈ కార్యక్రమంలో చింతామణి గణపతి దత్త క్షేత్రం ట్రస్ట్ నిర్వాహకుడు ఎం.ఆంజనేయరాజు, ప్రతినిధులు సి.పి.రామారావు, ఎస్.మహేష్‌కుమార్, ఎ.రవికుమార్, ఇంద్రలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



కన్యకాపరమేశ్వరి ఆలయంలో గోమాతకు దాణా తినిపిస్తున్న మైసూర్ దత్త విజయానంద తీర్థ స్వామీజీ

కన్యకాపరమేశ్వరి ఆలయంలో...

స్థానిక మొయిన్ రోడ్డు కన్యకాపరమేశ్వరి అమ్మవారి ప్రతిష్ఠ శత ఉత్సవాల్లో భాగంగా గురువారం మైసూర్ దత్త విజయానంద తీర్థ స్వామీజీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయంలో గోషాలకు వెళ్లి గోమాతకు దాణా తినిపించారు. అనంతరం కమిటీ సభ్యులు అమ్మవారి చిత్రపటాన్ని స్వామీజీకి అందజేశారు. ఈ సందర్భంగా స్వాజీ మాట్లాడుతూ గుడి బడితో సమానమన్నారు ఈ కార్యక్రమంలో ఉత్సవ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

మహారాణిపేట (విశాఖ): మండల స్థాయిలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి(సీఈవో) పి.నారాయణమూర్తి పిలుపునిచ్చారు. గురువారం జెడ్పీ సమావేశ మందిరంలో ఉమ్మడి విశాఖ జిల్లాల మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పరిపాలన అధికారులకు ఈ ఆఫీస్ నిర్వహణ, కార్యాలయ రికార్డులు, నిధుల వినియోగం, సాంకేతిక అంశాలపై నిర్వహించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఈవో నారాయణమూర్తి మాట్లాడుతూ వివిధ పద్దుల కింద ఉన్న నిధులను ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు పూర్తిగా ఖర్చు చేయాలన్నారు. మండల ప్రజా పరిషత్ రికార్డుల నిర్వహణ, వాటి ప్రాముఖ్యతపై సంబంధిత ఎంపీడీవోలు దృష్టి సారించాలన్నారు. అనంతరం జిల్లా పరిషత్ అధికారి శ్వేత పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా జీఎస్టీపై అవగాహన కల్పించారు. సమావేశంలో డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్, ఉమ్మడి విశాఖ జిల్లాల ఎంపీడీవోలు, పరిపాలనాధికారులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



పినపోతిన హైమ

యలమంచిలి రూరల్: అత్తారింటికి వెళ్తూ బస్ కాంప్లెక్స్‌లో వేచి ఉన్న వివాహిత అదృశ్యమైన ఘటనపై యలమంచిలి పట్టణ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పట్టణ ఎస్సై కే సావిత్రి వివరాల ప్రకారం... కోటవురట్ల మండలం కైలాసపట్నానికి చెందిన పినపోతిన హైమ(27) సంక్రాంతి పండుగ సందర్భంగా ఇటీవల రాంబిల్లి మండలం వై లోవ గ్రామంలో పుట్టింటికి వచ్చింది. ఈ నెల 22న మధ్యాహ్నం 3 గంటల సమయంలో కైలాసపట్నం వెళ్లడానికి భర్త దుర్గారావు, కుమార్తెతో కలిసి వై లోవ నుంచి యలమంచిలి బస్ కాంప్లెక్స్‌కు వచ్చారు. భార్య, కుమార్తెలను బస్టాండులో వేచి ఉండమని చెప్పి తన వద్ద ఉన్న చిరిగిపోయిన బ్యాగు కుట్టించుకు రావడానికి భర్త వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి బస్ కాంప్లెక్స్‌లో తన కుమార్తె మాత్రమే ఏడుస్తూ కనిపించగా, భార్య హైమ కనిపించలేదు. చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువులు, తెలిసిన వారి వద్ద అదృశ్యమైన భార్య ఆచూకీ కోసం ఆరా తీసినా ఫలితం లేకపోయింది. దీంతో భర్త గురువారం యలమంచిలి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై సావిత్రి తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



పట్టుబడిన గంజాయిని చూపిస్తున్న సీఐ, ఎస్‌ఐ

రాంబిల్లి(యలమంచిలి): గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసినట్టు రాంబిల్లి సీఐ సిహెచ్..నరసింగరావు, ఎస్ఐ నాగేంద్ర గురువారం రాత్రి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 21న అర్ధరాత్రి రాంబిల్లి నేవీ గేట్ సమీపంలో గంజాయితో ఇద్దరు వ్యక్తులకు నేవీ పోలీసులకు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి 235 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని రాంబిల్లి పోలీసులకు అప్పగించారు. విచారణలో మరో ఇద్దరి ప్రమేయం ఉన్నట్లు తేలింది. ప్రస్తుతం ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు జైలు, జరిమానా

విశాఖ లీగల్ : నిర్లక్ష్యంగా ఆర్టీసీ బస్సు నడిపి వ్యక్తి మృతికి కారణమైన డ్రైవర్‌కు ఏడాది జైలు శిక్ష, రూ.8 వేలు జరిమానా విధిస్తూ నగరంలోని ప్రధాన మెట్రోపాలిటిన్ మేజిస్ట్రేట్ ఎం.ప్రదీప్ కుమార్ గురువారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. సీనియర్ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపల్లి ఆదినారాయణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు ఎడ్ల గోవిందరావు ఆర్టీసీ డ్రైవరు. 2023 ఏప్రిల్ 14వ తేదీ ఉదయం టౌన్ కొత్త రోడ్డు నుంచి వన్‌టౌన్ పోస్ట్ ఆఫీస్ వైపు అతి వేగంతో బస్సును నడిపి ముందు వెళుతున్న ద్విచక్రవాహనదారుడు సూరాడ నరేష్‌ను ఢీకొట్టాడు. నరేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పటి వన్‌టౌన్ ఎస్ఐ జె.పురుషోత్తమరావు 304ఏ కింద కేసు నమోదు చేసి నేరాభియోగాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై పై విధంగా తీర్పునిచ్చారు.

గృహ నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసుకోవాలి

హౌసింగ్ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ బాబు



గృహ లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ డీడీ బాబు

చింతపల్లి: జిల్లాలో ప్రధానమంత్రి జన్‌మన్ పథకంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ బి.బాబు అన్నారు. అంజలిశనివారం పంచాయతీ పరిధిలో పక్కా గృహ లబ్ధిదారులతో ఆయన గురువారం అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. జన్‌మన్ పథకం ద్వారా అల్లూరి జిల్లాకు అధిక సంఖ్యలో ఇళ్లు మంజూరైనట్టు తెలిపారు.వీటిలో రెండు విడతల్లో 25,578 ఇళ్లు మంజూరు కాగా, కలెక్టర్ ప్రత్యేకంగా మరో 3005 ఇళ్లను మంజూరు చేశారన్నారు.ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.2.39 లక్షలు మంజూరు కాగా ప్రధానమంత్రి అవాస్ యోజన పథకం ద్వారా ఇళ్లకు రూ.1.80 లక్షలు మంజూరు చేయనున్నట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ ఇళ్ల నిర్మాణాలకు నిధుల కొరత లేదన్నారు. దశల వారీగా చేపడుతున్న నిర్మాణాలను బట్టి లబ్ధిదారుల ఖాతాలో నగదును జమచేస్తామన్నారు. సర్పంచ్ పేట్ల రాజుబాబు, ఏఈ రమణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో మెరుగైన ఫలితాలు



శిక్షణ కార్యక్రమానికి హాజరైన హార్టీకల్చర్ అధికారులు, సిబ్బంది

పాడేరు : భూసార పరీక్షల ఆధారంగా సాగుకు అవసరమైన పోషకాలు అందిస్తే మెరుగైన ఫలితాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బీఎస్ నందు అన్నారు. ఈ–మిర్చా 2.0 ప్రాజెక్టులో భాగంగా స్థానిక జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో డిజిటల్ గ్రీన్, ఉద్యానశాఖల ఆధ్వర్యంలో పంచాయతీ హార్టీకల్చర్, వ్యవసాయ శాఖ అసిస్టెంట్లకు మట్టి పరీక్ష విధానాలు, పసుపు ఉత్పత్తి నాణ్యతపై గురువారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మట్టి పరీక్షలను రైతు సాధికార కేంద్రాల్లో నిర్వహించాలన్నారు. పరీక్షల్లో గుర్తించిన పోషకాలను ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించి పెంపొందించాలన్నారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి రమేష్ కుమార్ మాట్లాడుతూ పసుపు ఉత్పత్తి మార్కెటింగ్‌లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. జిల్లా ఉద్యానశాఖ కార్యాలయంలో అందుబాటులో ఉన్న పసుపు నాణ్యత నిర్ధారణ ప్రయోగశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ జిల్లా మేనేజర్ ఎల్.భాస్కర్‌రావు, డిజిటల్ గ్రీన్ ప్రతినిధి జి.శ్రీకాంత్, స్పైసెస్ బోర్డు ప్రతినిధి కళ్యాణి, హార్టికల్చర్, వ్యవసాయ శాఖ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

30న చింతపల్లిలో నిరుద్యోగులకు ప్రేరణ

- ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు
- చింతపల్లి సీఐ వినోద్‌బాబు



చింతపల్లి: జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఈనెల 30న నిరుద్యోగులకు చింతపల్లిలో నిర్వహించే ప్రేరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీఐ వినోద్‌బాబు కోరారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిరుద్యోగ యువతకు ఇన్స్పైర్ సోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో టాటా ఎలక్ట్రానిక్స్ సంస్థలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. 18 నుంచి 25 ఏళ్ల వయసు కలిగి పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లమో అర్హత ఉన్న యువతీ యువకులు ఈ ఇంటర్వ్యూలకు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత భోజన,వసతి ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. శిక్షణ అనంతరం విశాఖ, నర్సాపూర్, కోరార్, మైసూర్,బెంగళూరు ప్రాంతాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. నెలకు రూ.18,950 జీతంతో పాటు ఇతర అలవెన్సులు చెల్లిస్తారన్నారు.ఆసక్తి ఉన్న అభ్యర్థులు అర్హత ధ్రువపత్రాలతో స్థానిక పోలీసు స్టేషన్‌లో దరఖాస్తులు అందజేయాలని సీఐ కోరారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం

గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డీడీ రజని



మాట్లాడుతున్న గిరిజన సంక్షేమశాఖ ఇన్‌చార్జి డీడీ రజని

పాడేరు: టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డీడీ ఎల్.రజని సూచించారు. స్థానిక ఐటీడీఏ పరిధిలోని 117 గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల తెలుగు, హిందీ, ఇంగ్లీష్ ఉపాధ్యాయులకు గురువారం పట్టణంలోని తలార్‌సింగి, లోచలిపుట్టు, శ్రీకృష్ణాపురం, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పునశ్చరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు చేశారు. టెన్త్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. సకాలంలో పాఠ్యాంశాలను పూర్తి చేయాలని సూచించారు. టెన్త్ పాఠ్యాంశాలపై కార్యచరణను పక్కాగా అమలు చేయాలన్నారు. ప్రతి విద్యార్థి కచ్చితంగా ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. టెన్త్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై కూడా అవగాహన కల్పించాలని ఆదేశించారు. టెన్త్ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారుల సత్తా



పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న ఫెడరేషన్ ప్రతినిధులు

చోడవరం: జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. రెండు బంగారు పతకాలు, ఒక కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నారు. ఇటీవల ఉత్తరప్రదేశ్ లక్నోలో జరిగిన జాతీయ స్థాయి 7వ ఓపెన్ తైక్వాండో పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి విశాఖ ఉమ్మడి జిల్లాకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. వారిలో చోడవరంలో శిక్షణ పొందిన సహస్ర స్పోర్ట్స్ అకాడమీ క్రీడాకారుడు కొల్లిపార తన్విత్‌ఉదయ్ సబ్ జూనియర్స్ విభాగంలో పూమ్‌సేలో బంగారు పతకం, క్యోరుగి కాంస్య పతకాన్ని సాధించారు. పూమ్‌సే విభాగంలో జి.కారుణ్య సందీప్ వ్యక్తిగత విభాగంలో బంగారు పతకాన్ని దక్కించుకున్నారు. విజేతలకు ఉత్తమ శిక్షణ ఇచ్చిన టీమ్ కోచ్‌లు కె.ప్రదీప్‌కుమార్, గండి శేఖర్‌బాబులను తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ టి.హర్షవర్ధన్ ప్రసాద్ రాష్ట్ర అసోసియేషన్ కార్యదర్శి చంద్రమౌళి, ఉపాధ్యక్షుడు శ్రీను, జిల్లా ఉపాధ్యక్షుడు పల్లం మురళి అభినందించారు.

జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీల విజేత వాయిలపాడు



పోటీలను తిలకిస్తున్న ప్రజలు



ప్రథమ స్థానంలో నిలిచిన ఎడ్ల యజమానికి నగదు బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

కె.కోటపాడు: చౌడువాడలో సీతారామాంజనేయ తీర్థం సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలు గురువారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 35 ప్రాంతాల నుంచి ఎడ్ల బళ్ల యజమానులు ఈ పోటీల్లో తలపడ్డారు. నిర్వాహకులు నిర్దేశించిన గమ్యాన్ని తక్కువ కాలవ్యవధిలో చేరుకున్న 20 ఎడ్ల బళ్ల యజమానులకు నగదు బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానంలో వాయిలపాడు ఎడ్ల బండి నిలిచింది. ఆ తరువాత స్థానాల్లో వరుసగా వల్లంపూడి, దేవరాపల్లి, లక్కవరం, ఎం.కొత్తపల్లి, ఎం.కొత్తపల్లి, వెంకువానిపాలెం, చుక్కపల్లి, ముద్దుర్తి, దేవరాపల్లికి చెందిన ఎడ్లు నిలిచాయి. ఈ పోటీలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చారు.

వంట గ్యాస్ చోరీ గుట్టురట్టు



సిలిండర్లను స్వాధీనం చేసుకుంటున్న ఏజెన్సీ నిర్వాహకులు

నర్సీపట్నం: నర్సీపట్నంలో వంట గ్యాస్ చోరీ గుట్టురట్టు అయింది. గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది సిలిండర్లలోని కొంత గ్యాస్‌ను తీసేసి వినియోగదారులకు అంటగడుతున్న వ్యవహారం గురువారం బయటపడింది. వివరాలిలా ఉన్నాయి. హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ డెలవరీ బాయ్ నానాజీ సిలిండర్లను వినియోగదారులకు సరఫరా చేయడానికి ముందు నిత్యం ఎస్సీ కాలనీలోని తన ఇంటికి తీసుకొస్తున్నాడు. ప్రతి సిలిండర్ నుంచి దాదాపు 4 కేజీల గ్యాస్ తీసి తన దగ్గర ఉన్న వేరే సిలిండర్‌లో నింపుకొంటున్నాడు. సిలిండర్ సీల్‌ను అనుమానం రాకుండా యథావిధంగా అమర్చుతున్నాడు. ఇలా తక్కువ బరువు ఉన్న సిలిండర్లను వినియోగదారులకు కొంత కాలంగా సరఫరా చేస్తున్నాడు. నిత్యం సిలిండర్లను ఇంట్లోకి తీసుకెళ్లి తీసుకొస్తుండడంతో అనుమానం వచ్చిన అదే కాలనీకి చెందిన ఎస్.తలుపులు ఇంట్లోకి వెళ్లి చూడడంతో గ్యాస్ చోరీ బండారం బయటపడింది. వెంటనే తలుపులు స్థానిక విలేకరులతో పాటు హెచ్‌పీ గ్యాస్ నిర్వాహకులకు తెలియజేశాడు. ఏజెన్సీ నిర్వాహకుడు బుచ్చిరాజు, సిబ్బంది వచ్చి నానాజీ ఇంట్లో ఉన్న నాలుగు సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు.

అధ్యాపకులు లేక.. బోధన సాగక

- కొయ్యూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఇబ్బంది
- పరీక్షలు ఎలా రాయాలో తెలియక ఆందోళన



తరగతి గదిలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ విద్యార్థులు

కొయ్యూరు: గత ఏడాది స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుల కొరత నెలకొంది. ఆవశ్యకతను గుర్తించిన గత ప్రభుత్వం జూనియర్ కళాశాలను మంజూరు చేసింది.అయితే ప్రస్తుత ప్రభుత్వం కనీసం అధ్యాపకులను కూడా నియమించలేదు. పాఠశాలలో ఉన్న వారే బోధన చేస్తున్నారు. ఫిజిక్స్,కామర్స్ అధ్యాపకుల కొరత మూలంగా పరీక్షలు ఎలా రాయాలో తెలియక విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.ఆంగ్లం, తెలుగు, గణితం, ఎకనామిక్స్‌కు ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారు. అటు పాఠశాల ఇటు కళాశాలలో బోధన చేయడం వారికి కష్టంగా మారింది. మొదటి ఏడాది కావడంతో ప్రభుత్వం ఎంపీసీ, సీఈసీ గ్రూపులను మంజూరు చేసింది. ఎంపీసీలో 20 మంది, సీఈసీలో తొమ్మిది మంది చేరారు. వసతి సౌకర్యం లేనందున ఆశించిన స్థాయిలో విద్యార్థులు చేరలేదు.

ఇబ్బంది లేకుండా చర్యలు



పాఠశాలతో సంబంధం లేకుండా జూనియర్ కళాశాలను ప్రభుత్వం మంజూరు చేస్తుంది.పూర్తిగా అధ్యాపకులు, ప్రిన్సిపాల్‌ను నియమిస్తుంది. రానున్న విద్యా సంవత్సరం నుంచి ఇది ప్రారంభం అవుతుంది. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులతో కళాశాల విద్యార్థులకు బోధన చేయిస్తున్నాం. వారికి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం

– ఎల్.రాంబాబు, ఎంఈవో, కొయ్యూరు

వైభవంగా పెదనందిపల్లి సత్యదేవుని తీర్థం



భక్తులతో కిటకిటలాడిన ఆలయ పరిసరాలు, (ఇన్‌సెట్) స్వామివారు

దేవరాపల్లి: పెదనందిపల్లిలో కొలువుదీరిన విజయ వెంకట సత్యనారాయణ స్వామి తీర్థం గురువారం వైభవంగా జరిగింది. రెండు రోజుల పాటు జరిగే తీర్థంలో భాగంగా తొలి రోజు పెందనందిపల్లి, చిననందిపల్లి, చేనులపాలెం, తారువా, తిమిరాం, మారేపల్లి, ఎం.అలమండ తదితర గ్రామాల ప్రజలతో పాటు ఉమ్మడి విశాఖ, విజయనగరం జిల్లాల వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

ఉదయం నుంచి స్వామివారి దర్శన కోసం భక్తులు పోటెత్తడంతో ఆలయ మెట్ల మార్గంతో పాటు రోడ్లు కిటకిటలాడాయి. భక్తులకు అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. కొండపై కొలువుదీరిన స్వామి వారిని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, తదితర ప్రజాప్రతినిధులు దర్శించుకున్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఎస్ఐ టి.మల్లేశ్వరరావు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. రాత్రి ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కొండిబలో తాగునీటి సమస్య పరిష్కారం

▶I పేజీ తరువాయి

వెచ్చించి గ్రావిటీ పథకం ద్వారా తాగునీరు అందించామన్నారు. కొండిబలో జెడ్పీనిధులు రూ. 5 లక్షలు, జల్‌జీవన్ మిషన్ నిధులు రూ. 11 లక్షలతో నిర్మించిన తాగునీటి పథకం, ఇంటింటికి కుళాయిలు, టోకూరులో జెడ్పీ నిధులు రూ. 5 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ. 3 లక్షలతో నిర్మించిన సీసీ డ్రైన్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ ప్రారంభించారు. కాశీపట్నం పంచాయతీ సీతంపేట, కోనాపురం పంచాయతీ బొందుగుడ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంతో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. ప్రజాప్రతినిధులకు థింసా నృత్యాలలో స్వాగతం పలికారు. మాజీ సర్పంచ్ మధుసూదన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దీసరి గంగరాజు, ఎంపీపీ శెట్టి నీలవేణి, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాంగి చిన్నారావు, ఎస్టీ కమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మీ, సర్పంచ్‌లు పంచాడి పున్నమి, సన్యాసిరావు, కిల్లో మోష్యా, జన్ని అప్పారావు, కొర్రా సింహాద్రి, పాగి అప్పారావు, ఎంపీటీసీ సారా రత్నకుమారి, మాజీ సర్పంచ్ గుడివాడ ప్రకాష్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ డి. రుక్మంగహర్‌రాజు పాల్గొన్నారు.